క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు మక్కెవారిపేట, గోలివారితోట, బాపనయ్య నగర్, వీఎస్ఆర్ గార్డెన్స్, టిడ్కో నివాసాలతో పాటు మంగళగిరి పట్టణంలోని గండాలయపేట, ఇందిరానగర్, ఏపీఎస్పీ క్యాంప్ రోడ్డు, ఇప్పటం రోడ్డు, వీవర్స్ కాలనీ, ఆత్మకూరు రోడ్డులలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ అక్కల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాలు ఏర్పాటు నిమిత్తం సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మంగళగిరి: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ వి. నిర్మల్ కుమార్ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో సరఫరా చేయడానికి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించినట్లు చెప్పారు. ఎంటీఎంసీ పరిధిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 7093912653 ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలు పై నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే అధికారులు సమస్యను పరిష్కరిస్తారని ఆయన తెలిపారు.

లావణ్యకు నగర మెడికల్స్ అసోసియేషన్ మద్దతు

మంగళగిరి: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యకు నగర మెడికల్స్ అసోసియేషన్ మద్దతు తెలిపింది. ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ హనుమంతరావు నివాసంలో లావణ్యను అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. ఆమెను అభినందించి విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు.

ఎస్ఐగా శ్రీనివాసరావు సేవలు అభినందనీయం



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన అల్లంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం పదవీ విరమణ చేశారు. దంపతులను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీహెచ్. రవికాంత్, సీఐ కల్యాణ్ రాజు మాట్లాడుతూ ఎస్ఐగా శ్రీనివాసరావు సేవలు అభినందనీయమన్నారు. కేసుల విషయంలో సూచనలు, సలహాలు బాగా ఇచ్చేవారని తెలిపారు. అలాంటి సీనియర్లు పదవీ విరమణ అనంతరం కూడా ప్రజలకు సేవలతో పాటు పోలీస్ శాఖకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు రమేష్ బాబు, ప్రతాప్‌కుమార్, సాయిబాబా, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వేయడం అందరి బాధ్యత



లక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ అమూల్యమైన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ముస్లిం మతపెద్ద మౌలానా ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. పొన్నూరు రోడ్డులోని ముస్లిం కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు వేసే ముందు ఒక్క క్షణం ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రాబోయే తరం భవిష్యత్తు కోసం ఓటును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ముస్లిం మైనారిటీలు ఓటు వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకోవాలని చెప్పారు. మన ఓటు రాష్ట్రంతో పాటు మన పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. అనంతరం ఓటు కార్డు గురించి అవగాహన కల్పించే కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మౌలానా మున్వర్, అబ్దుల్ ఖని, హఫీజ్ ఇసాక్, మౌలానా మహబూబ్, గులాం అలీ, ఖారి ఉస్మాన్, హఫీజ్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

విస్తృత సాహిత్య సృజన కేవీఆర్ సొంతం

లక్ష్మీపురం: విస్తృత సాహిత్య సృజనతో పాటు జీవితాంతం ప్రజా ఉద్యమాలలో కె.వి.రమణారెడ్డి పని చేశారని ప్రజా నాట్య మండలి జాతీయ కార్యదర్శి గని కొనియాడారు. అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కె.వి.ఆర్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. అభ్యుదయ ప్రగతిశీల భావాల వ్యాప్తికి, సాహిత్యకారునిగా మార్క్సిజం వెలుగులో కె.వి.ఆర్ పని చేశారని తెలిపారు. అధ్యాపకునిగా తోటి ఉపాధ్యాయులను, విద్యార్థులను కూడా రచయితలుగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి, సాహితీవేత్త ప్రసాదరావు, గాయకులు శ్యామాచార్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు పట్టం కట్టండి !

- ఎమ్మెల్యే ఆర్కే
- అందుబాటులో ఉండే లావణ్యను గెలిపించండి
- రాబోయే కాలంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి శ్రీకారం
- పరిపాలనలో మార్పు తెచ్చిన సీఎం జగన్
- ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే. వేదికపై ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల

తాడేపల్లి రూరల్ : మంగళగిరి నియోజకవర్గంలో చెప్పిన విధంగా విశ్వసనీయతతో పనిచేసే పార్టీ అయిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్యను గెలిపించాలని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం తాడేపల్లి అపర్ణ గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మె ల్యే కాండ్రు కమల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో మంగళగిరిలో ఎన్నడూ జరగని అభివృద్ధి జరిగిందని తెలిపారు. వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పలు రోడ్లను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలో మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు మంగళగిరి రత్నాల చెరువు వద్ద యూటీజీ ప్లాంట్ నిర్మించేందుకు 22 ఎకరాల భూమిని గుర్తించామని తెలిపారు. అక్కడ మురుగునీటిని శుద్ధి చేసి మొక్కలకు వాడడంతో పాటు మిగిలిన నీటిని నల్లమల డ్రైన్ ద్వారా పంపించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పిస్తే మురుగుడు లావణ్య ఆధ్వర్యంలో మంగళగిరి కార్పొరేషన్‌లో మురునీటిసమస్యను పరిష్కారం చూపిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య మాట్లాడుతూ అపర్ణ గేటెడ్ కమ్యూనిటీ వాసుల విజ్ఞప్తి మేరకు శ్మశానవాటికను నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిపాలనలో పెనుమార్పులు తీసుకువచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనార్టీలకు ప్రాధాన్యత కల్పిస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. అధికారులే ఇంటికి వచ్చి పనిచేసే విధంగా చర్యలు చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, అమరా నాగయ్య, అపర్ణ గ్రేటెడ్ కమ్యూనిటీ సెక్రటరీ కొండా ప్రతాప్‌రెడ్డి, అధ్యక్షులు అంబటి సుధాకర్‌రెడ్డి, ట్రెజరర్ అవినాష్, జిల్లా జేసీఎస్ కో- ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్ రాజు, మంగళగిరి నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ నాయకులు కత్తిక రాఘవరావు, నూతక్కి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, తిరుమలరెడ్డి, మిరియాల రాంబాబు పాల్గొన్నారు.

సీఎం జగన్ గెలుపు.. అభివృద్ధికి మలుపు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య
- గుండిమెడలో ప్రచారం



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య

తాడేపల్లి రూరల్ : ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని, అప్పుడే పేద ప్రజల జీవితాల్లో మార్పు వస్తుందని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య అన్నారు. ఆమె ఆదివారం రాత్రి గుండిమెడలో ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలకు ఇచ్చిన ప్రాధాన్యతతో పాటు అందజేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆర్‌సీఎం చర్చి వద్ద జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. గుండిమెడలో ఉన్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎంత మేలు జరిగింది అనేది అంతా ఆలోచించుకోవాలని సూచించారు. గతంలో సంక్షేమ పథకాలను అందించే క్రమంలో జరిగిన లోటుపాట్లు అందరికీ తెలుసు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో అనూహ్య మార్పు వచ్చిందన్నారు. ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించారని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణ మాఫీ అమలు చేశారని గుర్తు చేశారు. 'లబ్ధి పొందితేనే నాకు ఓటు వేయండి' అని అడిగిన మొట్టమొదటి వ్యక్తి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. అనంతరం చర్చిలో పాస్టర్ ప్రకాష్ మురుగుడు లావణ్య గెలుపు కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, ప్రముఖ న్యాయవాది బాజీ గంగాధర్, జేసీఎస్ కన్వీనర్ గుండిమెడ అర్జునరావు, తాడేపల్లి రూరల్ జేసీఎస్ కన్వీనర్ అనిల్ కుమార్, నామతోటి కోటేశ్వరరావు, జెట్టి కోటేశ్వరరావు, దావులూరి రమేష్, దావులూరి రత్నంరాజు, చైతన్య, అమృతరావు, పాల్గొన్నారు.

నేడు 12వ వార్డులో లావణ్య ప్రచారం

మంగళగిరి: పట్టణంలోని 12వ వార్డులోని మెయిన్ బజార్‌లో గల ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి సోమవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న ప్రచారంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొంటారని పేర్కొంది. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరింది.

భక్తిశ్రద్ధలతో ఏసు పునరుత్థాన వేడుకలు



తాడేపల్లి ఒకటో వార్డు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్



ప్రార్థనలలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు



వాక్యోపదేశం చేస్తున్న గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థలోను, దుగ్గిరాల మండల పరిధిలోనూ ఆదివారం తెల్లవారుజామున ఈస్టర్ పండుగ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు పునరుజ్జీవనానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. ప్రభువు సన్నిధికి చేరిన పెద్దలు తిరిగి వస్తారనే నమ్మకంతో వారి సమాధుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థనలు చేశారు. తెల్లవారుజామున చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రభువు భూమి మీదకు వస్తున్నట్లు బొమ్మలు ఏర్పాటు చేశారు. సాటి మనిషి కోసం ఏసుక్రీస్తు అనుసరించిన త్యాగనిరతి, శత్రువునైనా ప్రేమించాలన్న ఆదర్శాలు ప్రజలందరికీ అనుసరణీయమని పాస్టర్లు వివరించారు.

బాప్టిస్ట్‌పేటలో ప్రార్థనలు

మంగళగిరి: ఈస్టర్ పండుగ సందర్భంగా పట్టణంలోని బాప్టిస్ట్‌పేటలో వైఎస్సార్ సీపీ నాయకుడు కలకోటి బోయేజు, కలకోటి స్వరూపారాణి నివాసంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఈపూరి ఆదామ్,కలకోటి జాన్ బాబు,బుల్లా రాజారావు, మల్లవరపు సుధారాణి, నందిగం వసంతరావు, పాలేటి కృష్ణవేణి, రాంబాబు పాల్గొన్నారు.

తాడికొండ: ఈస్టరు పండుగను పురస్కరించుకొని తాడికొండ, తుళ్లూరు మండలాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు మరణించి మూడో రోజు పునరుత్థానుడై లేచిన సందర్భంగా తెల్లవారుజామున చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం మాకుమ్మడిగా సమాధుల తోటల వద్దకు వెళ్లి పెద్దల సమాధులను పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. బంధుమిత్రుల రాకతో కళకళలాడాయి. తాడికొండ చర్చిలో పాస్టర్ జాకబ్ వాక్యోపదేశం చేశారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు

ఫిరంగిపురం: లోకరక్షకుడు ఏసుక్రీస్తు అని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో సజీవుడైన ఏసుక్రీస్తు దివ్యపూజాబలి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య భక్తులను ఉద్దేశించి వాక్యోపదేశం చేశారు. పాప ప్రక్షాళన కోసం క్రీస్తు భూమిపై మరియతల్లి గర్భాన జన్మించాడని చెప్పారు. పాపాలను ప్రక్షాళన చేయడం కోసం ఎన్నో కష్టాలు, బాధలు భరించాడని, శిలువను మోసి దానిపై మరణించాడని, మూడో రోజు మరణాన్ని జయించాడని వివరించారు. ఆదియును అంతమునందు ఏసుక్రీస్తు యుగయుగములు అతని ఆధీనంలో ఉన్నాయన్నారు. మహిమ అధికారములు శాశ్వతంగా ఉంటాయని చెప్పారు. మహిమ కలవి అయిన ఆయన శరీరంపై ఉన్న గాయములు ద్వారా రక్షకుడు క్రీస్తు భక్తులను కాపాడుతాడని తెలిపారు. అనంతరం క్రీస్తు జ్యోతిని వెలిగించారు. దివ్య పూజాబలి నిర్వహించారు. సాయంత్రం బాల ఏసు ప్రతిమను తేరుపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మఠకన్య స్త్రీలు, గుడి పెద్దలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.



తాడికొండలో వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్ జాకబ్

175/175 సీట్లు ఖాయం



వృద్ధురాలిని పలకరించి ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత


తాడికొండ: దేశ చరిత్రలో 'మీకు మేలు జరిగితేనే నాకు ఓటెయ్యండ'ని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి, తాడికొండ నియోజకవర్గ అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. ఆదివారం తుళ్లూరు మండలం నేలపాడు, శాఖమూరు గ్రామాల్లో నిర్వహించిన నాయకుల ఆత్మీయ కలయిక, ప్రచారంలో భాగంగా ఆమె అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా జగనన్న అందించిన సేవలకు ప్రజలు రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారనేందుకు గడపగడపలో వస్తున్న ఆదరణే నిదర్శనమని తెలిపారు. 175/175 సీట్లలో వైఎస్సార్ సీపీని ప్రజలు గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు పేదలకు ఒరగబెట్టిందేమిటో ఒక్కటంటే ఒక్కటైనా చెప్పుకోగలడా ? అని ప్రశ్నించారు. 45 సంవత్సరాల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు, సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ఎదురొచ్చే దమ్ము లేక, పలు పార్టీలను కూడగట్టుకొని రావడం ఆయన భయానికి నిదర్శమని విమర్శించారు. ఎంతమంది నాయకులు కలిసి వచ్చినా రాష్ట్రంలో సీఎంగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనమైన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గాల్లో దీపం పెట్టుకొని ప్రజల్లోకి వస్తున్న పార్టీలన్నీ ఈ దెబ్బకు రాష్ట్రం విడిచి పారిపోయేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ప్రజల్లోకి వస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శృంగారపాటి సందీప్, రాష్ట్ర యువజన విభాగం నాయకులు చలివేంద్రం సురేష్, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకట శివారెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ తుమ్మూరు రమణారెడ్డి, శాఖమూరు మాజీ సర్పంచ్ తుమ్మూరు వరప్రసాద్‌రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు నాయుడు నాగేశ్వరరావు, మున్నంగి కోటిరెడ్డి, యార్డు డైరెక్టర్ జొన్నకూటి ప్రశాంత్, మండల ఉపాధ్యక్షుడు కొయ్యగూర వినోద్, యువజన విభాగం మండల మాజీ అధ్యక్షులు బెజ్జం రాంబాబు, ఆలోకం సురేష్, అన్నూరు జక్రయ్య, ఆరోగ్యం, ఇందుర్తి అప్పారావు, కాకర్ల నాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- ఎన్‌టీఆర్ విగ్రహానికి అధికారుల మునుగేస్తే... టీడీపీ నేతలే తొలగించారు
- తాడికొండ మండలం మోతడకలో ఘటన
- ఆర్ అండ్ బీ, పంచాయతీ స్థలంలో అనుమతులు లేకుండా పార్టీ కార్యాలయ నిర్మాణం
- 2006లో విగ్రహ నిర్మాణనికి పంచాయతీ తీర్మానం, 2021లో పార్టీ కార్యాలయంగా మార్పు



ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే విగ్రహం, పార్టీ కార్యాలయానికి ముసుగేసిన అధికారులు



ఇటీవల ముసుగు తొలగించిన ఎన్‌టీఆర్ విగ్రహం

తాడికొండ: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే అధికారులు ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగేస్తే, టీడీపీ నాయకులు తొలగించిన వైనం తాడికొండ మండలం మోతడక గ్రామంలో జరిగింది. గ్రామంలో ఆర్ అండ్ బీ, పంచాయతీ స్థలంలో ఎన్‌టీఆర్ విగ్రహ నిర్మాణానికి 2006లో తీర్మానం చేసి నిర్మించారు. అనంతరం విడతల వారీగా దానిపై శ్లాబ్ వేసి, 2021లో ఏకంగా పార్టీ కార్యాలయంగా చేసేశారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలో పార్టీ కార్యాలయాలకు అనుమతులు ఉండకూడదు, ఒక వేళ నిర్మించాలనుకున్నా పక్కాగా సీఆర్డీయే అనుమతులు ఉండాలి. కానీ ఇక్కడ అలాంటివి ఏమీ జరగలేదు. పార్టీ కార్యాలయం నిర్మాణం జరిగిన నాటి నుంచి ఇప్పటి వరకు పక్కా భవనానికి కనీసం పంచాయతీకి కూడా పన్ను చెల్లించడం లేదంటే నిబంధనల ఉల్లంఘన ఏ మేరకు జరుగుతుందో చెప్పాల్సిన అవసరం లేదు. ఎన్నికల కోడ్‌లో భాగంగా ఇప్పటికే పార్టీ కార్యాలయాలుగా కొనసాగుతున్న భవనాల్లో ఎలాంటి తొలగింపులు ఉండవంటూ అధికారులు చెబుతున్నారు. అయితే, ఇక్కడ విగ్రహ నిర్మాణానికి, భవనం నిర్మాణానికి మధ్య వేర్వేరు సమయాల్లో పంచాయతీ తీర్మానాలు చేశారు. విగ్రహానికి 2006లో, భవన నిర్మాణానికి 2021లో అనుమతుల కోసం పంచాయతీ తీర్మానం జరిగింది. అంటే సుమారు 18 సంవత్సరాల సమయంలో వేర్వేరుగా నిర్మాణం జరిగింది. కానీ పార్టీ కార్యాలయంలో విగ్రహంగా పరిగణనలోకి తీసుకొని యథేచ్ఛగా ముసుగు తొలగించడంపై పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాన్ని తొలగించడంతో పాటు ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగులు వేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

సంబంధిత కార్యాలయాన్ని ఇప్పటికే పరిశీలించాం. నివేదికను జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లాం. వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

– ఎం. గంగరాజు, తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి

సుప్రసిద్ధ రచయిత్రి తేజోవతి కన్నుమూత



పాత గుంటూరు: సమాచార శాఖ విశ్రాంత డెప్యూటీ డైరెక్టర్, దివంగత ఏ. విఠల్‌రావు సతీమణి సుప్రసిద్ధ రచయిత్రి డాక్టర్ అధరాపురపు తేజోవతి (88) ఆదివారం ఉదయం గుంటూరులో కన్నుమూశారు. ఆమె అనేక నవలలు, కథలు రాశారు. పూర్వా సంధ్య ప్రవర్తతే, మృత్యోర్మ అమృతంగమయ, విద్యార్థి లాంటి 15 కు పైగా నవలలు, 250 కథలు, 100కు పైగా రేడియో కథానికలు రాశారు. నాగార్జున విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం, బొమ్మిడాల జాతీయ సాహిత్య పురస్కారం ద్వారా అందిన రూ. 3 లక్షలను తను చదివిన శారదానికేతనం విద్యాలయం అభివృద్ధికి విరాళంగా అందజేశారు. వృద్ధుల ఆశ్రమాలు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం ఇప్పటికీ ప్రతి నెలా అందిస్తున్నారు. అంతిమ యాత్ర సోమవారం ఉదయం 10 గంటలకు స్వగృహం నుంచి ప్రారంభం అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి పరిశుద్ధ సమాజ కూడికలు

తెనాలిఅర్బన్: ఫిల ఢెల్ఫియా చర్చి ఆధ్వర్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు పరిశుద్ధ సమాజ కూడికలు నిర్వహించనున్నట్లు పాస్టర్ సీహెచ్.నతానియేలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని కొలకలూరు మత్తయ్య హాస్టల్ ఆవరణలో ప్రతిరోజు రాత్రి 7 గంటలకు సభలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విజయవాడకు చెందిన బ్రదర్ సీహెచ్.డేవిడ్ బ్రెన్‌హాం, ధరణి కోటకు చెందిన బ్రదర్ రేనాల్ట్స్ బాబు వాక్య పరిచర్య చేస్తారని తెలిపారు.

ఏసుక్రీస్తు జీవితమే గొప్ప సందేశం

పట్నంబజారు: దయ, త్యాగం, కరుణ ఎంతో గొప్పవనే సందేశాన్ని తన జీవితం ద్వారా విశ్వ మానవాళికి అందించిన మహోన్నతుడు ఏసుక్రీస్తు అని శాసనమండలి విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. సత్యంపై విశ్వాసానికి ఉన్న శక్తిని తెలిపిన మహిమాన్వితమైన రోజు ఈస్టర్ అని పేర్కొన్నారు. ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ముత్యం నివాసంలో ఆదివారం జరిగిన ఈస్టర్ పర్వదిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ సత్యాన్ని అంతం చేయాలని చూసిన ప్రతిసారీ అది ఏదో ఒక రూపంలో జన్మిస్తూనే ఉంటుందన్నారు. హింస, ద్వేషాలు కేవలం మరణాన్ని మాత్రమే మిగిల్చితే.. ప్రేమ, క్షమాగుణాలు జీవితత్వానికి నూతనత్వాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ సత్యాన్ని నిరూపించడానికి సమాధి నుంచి సజీవుడై ఏసు ప్రభువు లేచి వచ్చారని తెలిపారు. ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం, విశ్వ సంక్షేమం కోసం ప్రతి ఒక్కరికీ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. యావత్ క్రైస్తవ సమాజానికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వేడుకలకు హాజరైన వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణను లేళ్ల అప్పిరెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

ఘనంగా మంజునాథ నాట్య క్షేత్రం వార్షికోత్సవం



నాట్యక్షేత్రం చిన్నారులతో అతిథులు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం వేదికపై ఆదివారం శ్రీ మంజునాథ నాట్యక్షేత్రం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకులు రాజుపాలెం మనోజ్ఞ ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్య అతిథులుగా విజయ మాధవి సేవా సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు విజయ మాధవి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే నృత్యంలో ప్రావీణ్యం పొందే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా నాట్యక్షేత్రం విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శరణం నరేంద్రకుమార్, జంపని కిశోర్‌బాబు, సగుటూరు వెంకటరమణ, శారద, కె. శ్రీనివాసమూర్తి, సి.ఎ.కె.వి. బ్రహ్మం, మహంకాళి శ్రీనివాసరావు, డాక్టర్ టి. పవన్‌కుమార్, డాక్టర్ ఎం. వెంకట నరేష్, డాక్టర్ డి. నాగమల్లేశ్వరి, డాక్టర్ శర్మ పాల్గొన్నారు.